
**కథ**

# లోకేశం-సెల్‌ఫోన్ లవ్‌స్టోరీ

నౌండ్ల శ్రీనివాసు



''సెల్ గురించి మాకేం తెలుసు? పనీపాటా లేని చిల్లర వెధవలకు తెలుసు. అమ్మాయిల్ని అల్లరి పెట్టే అడ్డగాడిదలకు తెలుసు. ఆ తర్వాత తమకే తెలుసు'' అంటూ లోకేశంను అవహేళన చేయడం, నిత్యం అతని సెల్‌ఫోన్ ఉపదేశాలు వినీ వినీ విసుగెత్తిపోతున్న చుట్టుపక్కలవాళ్లకు అలవాటుగా మారింది.

ఎందరేమన్నా, లోకేశం ఉపదేశాలు చేయకుండా వుండలేడు. తను చేసే పని మేలు కలిగించేదే అయినప్పుడు ఆ పని ఎందుకు మానుకోవడం? అన్నదే అతని రాద్ధాంతం, సారీ సిద్ధాంతం.

''సెల్‌ఫోన్ మన చేతిలో వుంటే పడక గదిలో వుంటూనే ప్రపంచం మొత్తం చుట్టేరావచ్చు. నువ్వూ ఓ సెల్ తీసుకోరాదూ...'' అని సెల్‌ఫోన్ లేనివాళ్లకు సలహాలిస్తాడు. అవసరం అయితే ఓ దండకం పాడినట్లు, ఓ మహాపురాణం ప్రవచించినట్లు, చకచకా సెల్‌ఫోన్ మహత్యం వివరిస్తాడు.

''భలేవాడివి... సెల్‌ఫోన్‌తో నాకేం అవసరం?'' అని ఎవరైనా అంటే- అట్లాంటి మాటలు లోకేశం నమ్మడు. 'సెల్‌ఫోన్ అవసరం అందరికీ వుంటుంది. దాన్ని కొనుక్కునేందుకు చేతకాని వాళ్లే అట్లా అంటారు' అనుకుంటాడతను. కొత్తగా సెల్‌ఫోన్ తీసుకువెళ్లేవారెవరైనా కనిపిస్తే- ''సెల్ గురించి నాకు తెలియని సంగతులేం లేవు. ఏ ప్రాబ్లెం వచ్చినా నేనున్నాను'' అని ధీమాగా ధైర్యం మారిపోస్తాడు.

'సెల్ గురించి తనకెంత తెలిసినా, ఇంకా నేర్చుకోవలసినవి బాగానే వున్నాయి' అని మనసులో మాత్రం నవ్వుతాడు.

'సెల్‌ఫోన్ ఓ మహాసముద్రం లాంటిది. రోజా దాని గురించి శోధించి సాధిస్తేగానీ చాలా విషయాలు కనిపెట్టలేం' అని అతని అభిప్రాయం.

అందుకే- ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తోనే గడుపుతాడతను. ఇల్లు, ఆఫీసు, రోడ్డు అనే భేదాలు లేకుండా సెల్ ఉపయోగిస్తూనే వుంటాడు.

ఈ క్రమంలో చాలా సంగతులే తెలుసుకున్నాడు లోకేశం. సెల్‌ఫోన్‌తో ఆత్మహత్య కూడా చేసుకోవచ్చు అనే విషయం అన్నిటిలోకెల్లా అతన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచింది.

★ ★ ★

లోకేశం సెల్‌ఫోన్ జీవితంలో అద్భుతమైన ఘట్టం అతని ప్రేమకథ...

ఓరోజు ఏదో తెలియని నెంబరు నుంచి మిస్డ్ కాల్ వచ్చిందతనికి. అది పట్టించుకోలేదతడు. మళ్లీ మళ్లీ అదే నెంబరుతో మిస్డ్ కాల్ రావడంతో పట్టలేని చిరాకేసిందతనికి. ఎప్పుడు కాల్ వచ్చినా చటుక్కున రిసీవ్ చేసుకోవాలనుకున్నాడు. అందుకోసం తన వేలును సంబంధిత 'కీ' మీద ఆన్చి పట్టుకుని వుండిపోయాడు. అట్లా ఎంతసేపు వుండిపోయాడో! ఒక్క కాల్ కూడా రాలేదు.

ఇక మళ్లీ వచ్చేలా వుందనుకుని ఓ నిమిషం అజాగ్రత్తగా వున్నాడు. మళ్లీ అప్పుడు వచ్చింది మిస్సుడు కాల్. అంతా ఎవరో తనను దూరం నుంచి కనిపెడుతూ చేస్తున్నట్లుగా వుందతనికి.

ఇట్లాగైతే లాభం లేదు. సరాసరి తనే ఫోన్ చేసి నాలుగైదు తిట్లు చడామడా తిట్టేవేయాలనుకుని ఓ టెలిఫోన్ బూత్‌కు వెళ్లి, ఆ

నెంబర్ డయల్ చేశాడు. తన సెల్ నుంచి కాల్ చేస్తే, ఒకవేళ భయం వల్ల అవతలి వ్యక్తి రిసీవ్ చేసుకోపోవచ్చు అని తెలివిగా ఆలోచించాడు కాబట్టే మరో ఫోన్‌లోంచి కాల్ చేశాడతడు.

''హల్లో...'' అంటూ తియ్యతియ్యగా ముద్దుముద్దుగా వినిపించింది అట్నుంచి. అంతే! తిరిగి ''హల్లో'' అని కూడా అనలేదతడు. వైబ్రేటింగ్ అలర్ట్ సిస్టమ్‌లాగా అతని గుండె దడదడలాడిపోయింది. చటాలున ఫోన్ పెట్టేశాడతడు.

అంటే... అంటే... తనకు రోజూ మిస్సుడు కాల్ చేస్తుంది ఓ అమ్మాయి అన్నమాట. రిథమిక్ బ్యాక్‌లైట్‌లాగా వెలిగిపోయిందతని ముఖం.

★ ★ ★

లోకేశానికి ఇంకా పెళ్లికాలేదు.

''ఒరేయ్... పెళ్లెప్పుడు చేసుకుంటావ్‌రా... నాలాగా ముసలితనం వచ్చిపడ్డాకనా?'' మూలగదిలో మూలిగే బామ్మతో సహా ఇంట్లోవాళ్లంతా పోరుపెడుతుంటే- భరించలేక పదిరోజులకోసారో, పదిహేను రోజులకోసారో సంబంధాల వేటలో పడిపోతుంటాడు లోకేశం. అట్లా చేసేదంతా ఊరికే. రంభలాంటి అమ్మాయి కనిపించినా, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవడం ససేమిరా ఇష్టంలేదతనికి.

పెళ్లంటూ చేసుకుంటే లవ్ మ్యారేజ్ చేసుకోవాలి. అదీ సాదాసీదా లవ్ మ్యారేజ్ కాదు, 'సెల్‌ఫోన్ లవ్ మ్యారేజ్' మాత్రమే చేసుకోవాలని అతని ఆశయం.

తన ఆశయసాధన కోసం ఆ దిశగా ప్రయత్నం సాగించాడు. కానీ లాభం లేకుండా పోయింది. మిస్సింగ్ కాల్ చిట్కాలు, మెసేజింగ్ కిటుకులు, చాటింగ్ చమక్కులు... పాపం, అన్ని రకాల ప్రయోజనాలు చేశాడు. బిల్లు వేలల్లో అయి జేబు తడిపింది గానీ, ఒక్క ఆడపిల్ల కూడా సెల్‌ఫోన్ వల్లో చిక్కలేదు.

కాలం కలిసిరావడం లేదని విసుగు పుట్టి వూరుకుండిపోయాడు. సరిగ్గా అప్పటి నుంచే అతనికి రావడం మొదలయ్యాయి మిస్సుడు కాల్స్.

తనలాగే అమ్మాయిల్ని వెదుక్కునే కుర్రాళ్లెవరో లవ్ ఏజ్ వచ్చి ఈ పనులు చేస్తున్నారు కావచ్చు అనుకొని పట్టించుకోలేదు లోకేశం.

ఇట్లా తన సిగ్నల్‌కు అదృష్టం పట్టి ఓ అమ్మాయి లైన్లో పడుతుందని ఎప్పుడూ అనుకోలేదతడు.

దొరక్క దొరక్క దొరికిన అమ్మాయిని వదిలిపెట్టకూడదని నిశ్చయించుకున్నాడు. ఎట్లాగయినాసరే ముందుగా ఆమెను తన లవ్‌లో పడగొట్టాలి. ఆ తర్వాత పెళ్లి చేసుకొని ఒళ్లో పడగొట్టుకోవాలి అని ఫిక్స్‌డ్ కాల్‌లా ఫిక్సయిపోయాడు.

రింగ్ టోన్స్‌లోని ఓ స్తోత్రం ప్లేచేసి- సెల్ మహాదేవిని భక్తితో కళ్లకద్దుకుని రంగంలోకి దిగిపోయాడు.

మిస్సుడు కాల్‌తో మొదలెట్టి అయిదు నిమిషాల్లోపలే అట్నుంచి ఓ మెస్సేజ్ అందుకుని మురిసిపోయాడు.

'అయ్యబాబోయ్... ఏంటో అనుకున్నాను. స్పీడ్ డయల్ సిస్టమ్‌లాగా మరీ ఫాస్టు ఈ అమ్మాయి' సిగ్నల్ గీతలా అంతెత్తుకు ఎగిరాడు.

'నేను హైదరాబాద్‌లో వుంటాను. మీరు ఎక్కడ వుంటారు?' వచ్చీరాని ఇంగ్లీషులో కాస్త పెద్దగా వున్న పదాలను ఎక్కడికక్కడే విరిచి ఏకాక్షరాల్లోకి కుదించి వుంది.

అది అర్థం చేసుకోడానికి కష్టపడ్డాడు లోకేశం. అర్థమయ్యాక ఆమె మైండ్ సెట్టింగ్స్‌లో ఏం వుందో తెలియక అయోమయంలో పడ్డాడు.

తనెక్కడ వుంటాడో తెలిస్తేగానీ ఇష్టం చూపదేమో! హైదరాబాద్ వాడంటే ఇంట్రెస్టు కలుగుతుందో లేదో ఆమెకు. ఏమీ పాలుపోక చిన్నబోయాడతడు.

గంట తర్వాత మళ్లీ ఆమే ఓ మెస్సేజీ పంపిస్తేగానీ అతనిలో ఉత్సాహం రీఛార్జ్ కాలేదు.


'మీది కూడా హైదరాబాదే కావాలని వుంది' అని ఆ మెస్సేజీ.

వెంటనే మెస్సేజీకి రిప్లై పంపించాడతడు.

ఈసారి ఏకంగా- 'ఐ లవ్ యూ' అంటూ వచ్చి పడిందటు నుంచి. ఇంకేం? ఉల్లాసంతో రింగ్‌టోన్ అయిపోయాడు.

ఇద్దరి ప్రేమ కొద్దిరోజుల్లోనే ఇంటర్నేషనల్






రోమింగ్ కాల్స్ బిల్లులాగా ఎదిగిపోయింది.

ఎంతగా ఎదిగితేనేం? ముదిరితేనేం? ఆమె తన పేరైనా చెప్పలేదతనికి. అతడెన్నిసార్లు అడిగినా- ''ముందు మీ పేరు'' అంటూ రిప్లై పంపించిందామె.

''నువ్వు చెప్పందే నేనెందుకు చెప్పాలి?'' అని బెట్టుకుపోయాడు లోకేశం, సరసాల అలుకతో.

ఒక్కసారైనా ఆమెతో మాట్లాడలేదతడు. చూడలేదు కూడా.

'మామూలు ప్రేమ గుడ్డిదంటారు. సెల్‌ఫోన్ ప్రేమకు గుడ్డితనంతో పాటుగా మూగతనం, చెవిటితనం కూడా వుంటాయని మనం మరో చరిత్ర సృష్టిద్దాం' అని ఇద్దరూ ఓ అండర్‌స్టాండింగ్‌కు వచ్చి, డిస్టెన్స్ మెయిన్‌టెయిన్ చేయడం కొనసాగించారు.

నెలలు గడిచిపోతున్నా తన ప్రేమ సంగతి ఇంట్లో చెప్పలేదతడు. పెళ్లిచూపులకు వెళ్లిన ప్రతి సంబంధాన్ని మాత్రం ఏదో వంక పెట్టేసి రిజెక్ట్ చేస్తున్నాడు.

లోకేశం ప్రవర్తన మీద విసుగేసి ఓ నిర్ణయానికి వచ్చాడతని తండ్రి అప్పుల్రావ్. లోకేశం ప్రమేయం లేకుండానే ఓ సంబంధం ఖాయం చేయడానికి సిద్ధపడ్డాడతడు. తండ్రి నిర్ణయానికి సెల్‌ఫోన్ పేలిపోయినట్లుగా అదిరిపడ్డాడు లోకేశం. ఎట్లాగయినా తప్పించుకోవాలని ప్రయత్నించాడతడు.

''నాకు నచ్చలేదా అమ్మాయి'' ఎప్పట్లాగే చెప్పాడు. కానీ ఎంతో ఎమోషనల్‌గా చెప్పాడు.

''నీ మొహానికి ఏ అమ్మాయి మాత్రం నచ్చుతుందని? ఇప్పటికే వందమందిని చూసి తగలడ్డావ్. నీ మొదటి చూపుల్లోని అమ్మాయికి ఓ కూతురు పుట్టి, పెళ్లికెదగడానికి కూడా సిద్ధంగా వుందట. నీ బ్రతుక్కింకా పెళ్లే దిక్కులేదు'' తిట్టింది తిట్టకుండా అప్పుల్రావ్ తిట్టేసరికి లోకేశం కాస్త శోకేశం అయ్యాడు.

ఇన్నాళ్లు సెక్యూరిటీ కోడ్‌లా మైండ్‌లోనే దాచుకున్న తన సెల్‌ఫోన్ లవ్ మ్యాటర్ చెప్పేశాడు.

వింటూనే విస్తుపోయారంతా.

''ముక్కూ మొహం తెలియని అమ్మాయిని ప్రేమించడం ఏమిట్రా? నిన్నూ, నీ సెల్‌ఫోన్నూ తగలేయా... పెళ్లి కూడా సెల్‌ఫోన్‌తోనే చేసుకుంటావా ఏమిట్రా?'' వెటకారం చేస్తూనే వాపోయాడు అప్పుల్రావ్.

''నాకూ అట్లాగే వుంది. సెల్‌ఫోన్‌లో మ్యారేజ్ సిస్టమ్ ఇంకా మన దేశంలోకి రాలేదు. తొందర్లోనే వస్తుందంటున్నారు'' తండ్రి వెటకారం బుర్రకెక్కించుకోలేని లోకేశం అమాయకంగా హుందాతనానికి పోయాడు.

''నోర్మూయ్...'' తిక్కరేగిపోయింది అప్పుల్రావ్‌కు.

''అడ్డగాడిద, అంట్లవెధవ, సెల్‌ఫోన్ చవట...'' ఎక్కడెక్కడో తనకు తెలిసిన పాత తిట్లతో పాటుగా లోకేశానికి సరిపోయే కొత్త తిట్లు కూడా కనిపెట్టి మరీ తిట్టాడు అప్పుల్రావ్.

''ఆ అమ్మాయి ఎవరో రేపు మనింటికి తీసుకొనిరా. నచ్చితే ముహూర్తాలు పెట్టిద్దాం'' కాస్త శాంతించాక చివర్లో చెప్పాడతడు.

★ ★ ★

ఆమెతో సరాసరి మాట్లాడి పెళ్లి ఏర్పాట్లు చేసుకోవడమే మంచిది. తన సెల్ నుంచి ఆ అమ్మాయికి ఫోన్ చేశాడు లోకేశం.

ఇంకా, అతడు పలకరింపుగా హల్లో అని కూడా అనలేదు. అటు నుంచి ధుమధుమలాడిపోతూ వినిపించింది ఆమె గొంతు.

''నువ్వేనా ప్రేమా ప్రేమా అంటూ మెస్సేజీలు పంపుతుంది? సిగ్గులేదా నీకు? నీ దరిద్రపు మొహానికి పెళ్లయినవాళ్లే కావాలా? మరోసారి ఫోన్ చేశావంటే చీపురుతో కొడతా, చెప్పుతో...'' అంటూ ఆగకుండా చెవుల్లో తాకుతున్న తిట్లకు, చెంపదెబ్బల్లేకుండానే గూబలు గుయ్యిమన్నాయి.

అదిరిపడి సెల్ ఆఫ్ చేశాడు లోకేశం. అంతా అయోమయంగా అతలాకుతలంగా వుంది.




ఇన్నాళ్లు ప్రేమిస్తున్నానంటూ చెప్పిన అమ్మాయేనా ఇప్పుడు ఆగకుండా తనను వాయించింది? అతనికి నమ్మబుద్ధి కాలేదు. ఆల్‌రెడీ ఆమెకు పెళ్లయిపోయిందనే సంగతి అతని బుర్రకు చేరేసరికి, తన్ను తంతే చేతిలో సెల్ పట్టుకొని సిగ్నల్ లేని ఏరియాలో పడిపోయినట్టుగా విలవిల్లాడిపోయాడు.

ఛీ ఛీ! తన జీవితం మీద తనకే విరక్తి కలిగింది. సెల్‌ఫోన్ పెళ్లి ఎట్లాగూ అయ్యేలా లేదు. దీనితో కనీసం చావైనా వచ్చిపడితే చాలు అనుకుంటూ సిటీకి దూరంగా వెళ్లి- తన సెల్‌ఫోన్‌లో సూయిసైడ్ సిస్టమ్ ఓపెన్ చేసి, ఓకే అన్నాడు.

''ష్యూర్?'' అడిగింది.

అవునన్నట్లుగా 'కీ' నొక్కాడు.

'కన్‌ఫామ్?' అంటూ మళ్లీ అడిగింది.

తొలిసారిగా సెల్ మీద కోపం వచ్చిందతనికి. చచ్చేప్పుడు కూడా చావనిచ్చేలా లేదు అనుకుంటూ- 'కన్‌ఫామ్' చెప్పబోయాడు.

సరిగ్గా అప్పుడే అక్కడికి మరో వ్యక్తి రావడంతో తన ప్రయత్నం మాని అతని వైపు చూశాడు లోకేశం. వచ్చిన వ్యక్తి కూడా ఆత్మహత్య చేసుకోడానికే చూస్తున్నట్లుగా వుంది. సెల్‌తో కాదు సరాసరిగా గుట్ట మీది నుంచే దూకేలా కనిపిస్తున్నాడు.

''ఏంటి సూయిసైడేనా?'' ఒకింత ఆసక్తిగా అడిగాడు లోకేశం.

''ఆ... ఈ సెల్‌ఫోన్ నా చావుకే వచ్చింది'' అంటూ తన చేతిలోని సెల్‌ఫోన్‌ను విసురుగా గుట్టల్లోకి పడేశాడు.

''నీదీ సెల్ సంగతేనా?'' మరింత ఆసక్తి పెరిగింది. వివరంగా చెప్పమన్నట్లుగా అడిగాడతన్ని.

''ఏముంది, ఏదో క్రేజీగా ఓ అమ్మాయితో నేను సెల్‌ఫోన్‌లో లవ్‌స్టోరీ జరిపిన సంగతి మాయావిడకి తెలిసిపోయింది. ఆ అమ్మాయి నాకు ఫోన్ చేస్తే, నా ముందే ఆమెను చెడామడా తిట్టిపోసింది. పాపం... ఎంత బాధ పడిపోయిందో ఆ అమ్మాయి!'' వింటూ వుంటే అచ్చంగా తన స్టోరీలాగే అనిపిస్తుంది లోకేశానికి.

''ఆ అమ్మాయి దక్కలేదు. నా భార్య కూడా నన్ను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది'' కీచుగొంతుతో లబోదిబోమన్నాడా వ్యక్తి.

''మీ సెల్ నెంబర్ ఎంత?'' కాస్త సందేహంగా, ఆత్రంగా అడిగాడు లోకేశం. చెప్పాడతడు. అది తను ఇన్నాళ్లూ చేసిన నెంబరే! అంటే- 'అమ్మాయి అనుకొని నేను స్నేహం చేసింది ఇతనితో అన్నమాట!' దభాల్న కూలిపోయాడు లోకేశం. ☆